
సాక్షి
సూర్యాపేట
శనివారం ׀ 25 ׀ జనవరి ׀ 2025


పర్యాటక అందాలు
ఉమ్మడి జిల్లాలోని పలు పర్యాటక ప్రదేశాలు పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. నేడు జాతీయ పర్యాటక దినోత్సవం. - 10లో


అద్భుతం.. బుద్ధవనం
బుద్ధవనం నిర్మాణం మహా అద్భుతంగా ఉందని ఇండియన్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ బృందం సభ్యులు కొనియాడారు. - 10లో


చదువులో మేటి.. జీవితంలో ఓడి
భర్త చోరీ కేసుల్లో నిందితుడని తెలియడంతో కుమార్తెలకు ఉరివేసిన మహిళ తాను సైతం ఆత్మహత్యకు పాల్పడింది. - 10లో

న్యూస్‌రీల్

గోదావరి జలాల నిలిపివేత

అర్వపల్లి: యాసంగి సీజన్‌కుగాను జిల్లాకు విడుదల చేసిన గోదావరి జలాలు వారబందీ విధానంలో శుక్రవారం నిలిపివేశారు. ఈ విధానంలో ఈనెల 16న గోదావరి జలాలను రెండో విడతగా పునరుద్ధరించారు. తిరిగి వారం రోజులు కావడంతో నిలిపివేసినట్లు బయ్యన్న వాగు డీఈఈ సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 31న మళ్లీ వారబందీ విధానంలో గోదావరి జలాలను పునరుద్ధరించి ఫిబ్రవరి 7 వరకు విడుదల చేస్తామని పేర్కొన్నారు.

టెన్త్ విద్యార్థులను సంసిద్ధం చేయాలి


ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు నగదు బహుమతి అందజేస్తున్న డీఈఓ అశోక్

అర్వపల్లి: మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయాలని డీఈఓ అశోక్ అన్నారు. మండల పరిధిలోని తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకు క్రమం తప్పకుండా స్టడీ అవర్స్ నిర్వహించాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేకంగా బోధించాలన్నారు. అదేవిధంగా రిపబ్లిక్ డే సందర్భంగా ఆటల పోటీలు నిర్వహిస్తుండగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల రికార్డులను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన కుర్చీల ఆటలో గెలుపొందిన చిన్నారులకు సొంతంగా నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కుంభం ప్రభాకర్, చంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఫర్హీన్ కౌసర్

చివ్వెంల(సూర్యాపేట): క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని సూర్యాపేట జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఫర్హీన్ కౌసర్ అన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం సూర్యాపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, స్నేహపూర్వకంగా ఆడాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దపుకు మల్లయ్య, న్యాయవాదులు సీనపల్లి సోమేశ్వర్, నాతి సవీందర్ కుమార్, కొంపల్లి లింగయ్య, పిట్టల వెంకటేశ్వర్లు, బాగాల నర్సింహ, జిరకక చంద్రమౌళి, కిశోర్‌కుమార్, కోణం రఘురామయ్య, పత్తిపాక రాధకృష్ణ, అనంతుల సందీప్, సుంకరి రవికిశోర్ తదితరులు పాల్గొన్నారు.

దేవరపెట్టె మహాయాత్రను విజయవంతం చేయాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పెద్దగట్టు ఆలయ కమిటీ చైర్మన్ నర్సయ్య యాదవ్

చివ్వెంల(సూర్యాపేట): శ్రీ లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతర నేపథ్యంలో ఫిబ్రవరి 1న దిష్టిపూజ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే దేవరపెట్టె మహాయాత్రను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ పోలేబోయిన నర్సయ్య యాదవ్ కోరారు. శుక్రవారం చివ్వెంల మండల పరిధిలోని దురాజ్‌పల్లి శ్రీ లింగమంతుల స్వామి ఆలయ ప్రాంగణంలో మహాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఫిబ్రవరి 1న ఉదయం మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం చీకటయపాలెం నుంచి సూర్యాపేట వరకు మహాయాత్ర ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మెంతబోయిన చిన్న మల్లయ్య, వీరబోయిన సైదులు యాదవ్, బైకానులు తండు రామస్వామి, తండు యాకయ్య, తండు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

● వైభవంగా గంధోత్సవం



పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా ఉర్సులో భాగంగా శుక్రవారం నిర్వహించిన గంధం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు, దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తదితరులు - పాలకవీడు

గ్రామసభల్లో జనాగ్రహం

ముగిసిన ప్రజాపాలన గ్రామసభలు
- జాబితాల్లో అర్హులకు కాకుండా అనర్హుల పేర్లు చేర్చారని మండిపాటు
- తుంగతుర్తిలో సభకు హాజరైన ఎమ్మెల్యే మందుల సామేల్‌కు నిరసన సెగ
- మునగాలలో ఆత్మీయ భరోసా ఎవరికీ అందడం లేదని ఉపాధి కూలీల ఆందోళన
- గ్రామసభల్లో కొత్తగా వచ్చిన దరఖాస్తులు 77,037


తుంగతుర్తిలో ఎమ్మెల్యేమందుల సామేల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

భానుపురి (సూర్యాపేట): నాలుగు సంక్షేమ పథకాల అమలు కోసం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలు శుక్రవారంతో ముగిశాయి. రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల అర్హుల జాబితాలను అధికారులు చదివి వినిపిస్తున్న క్రమంలో జాబితాల్లో అర్హుల పేర్లు కాకుండా అనర్హుల పేర్లు ఎలా చేర్చారని పలు చోట్ల అధికారులను ప్రశ్నించారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగలేదని, ఎవరిని అడిగి జాబితాలు రూపొందించారని నిలదీశారు. పలు చోట్ల ప్రజాప్రతినిధులకు నిరసన సెగ తగిలింది.

ఎమ్మెల్యే కు నిరసన సెగ
తుంగతుర్తి మండల కేంద్రంలో జరిగిన గ్రామసభలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు నిరసన సెగ తగిలింది. సభలో ఎమ్మెల్యే మాట్లాడబోతుండగా లబ్ధిదారుల పేర్లు చదివిన తర్వాతే మాట్లాడాలని గ్రామస్తులు పట్టుబట్టారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా ఘర్షణ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే డౌన్.. డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో ఎమ్మెల్యే సమావేశం నుంచి వెళ్లిపోతుండగా గ్రామస్తులు ఎమ్మెల్యే గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. అదే విధంగా తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లోనూ ప్రజలు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందడం లేదని ఆందోళన చేశారు. మునగాలలోనూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ఎవరికీ అందడం లేదని ఉపాధి హామీ పథకం కూలీలు ఆందోళన చేశారు. వీరికి సీపీఎం, బీఆర్‌ఎస్ నాయకులు మద్దతు తెలిపారు.

కొత్తగా వచ్చిన దరఖాస్తులు 77,037
జిల్లాలో మొత్తం 475 గ్రామపంచాయతీలు, ఐదు మున్సిపాలిటీల పరిధిలో 141 వార్డులు ఉన్నాయి. అధికారులు వెల్లడించిన జాబితాలే కాకుండా రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం మొత్తం 77,037 దరఖాస్తులు వచ్చాయి. అందులో రైతుభరోసాకు 2828, ఆత్మీయ భరోసాకు 22,186, ఇందిరమ్మ ఇళ్లకు 28,225, రేషన్‌కార్డులకు 23,798 దరఖాస్తులు వచ్చాయి.

కొత్తగా వచ్చిన అర్జీలు ఇలా..

తేదీ	రైతుభరోసా	ఆత్మీయ భరోసా	ఇందిరమ్మ ఇళ్లు	రేషన్‌కార్డులు
21	407	4600	5135	4897
22	630	5540	7166	5356
23	978	6548	7164	6530
24	813	5498	8760	7015
	2828	22,186	28,225	23,798

పంచాయతీ కార్యదర్శిని కార్యాలయంలోకి పంపించి తాళం

కోదాడరూరల్: కోదాడ మండలంలోని రామలక్ష్మీపురంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలో తీవ్రదుమారం లేచింది. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జాబితాలో అర్హుల పేర్లు కాకుండా ఉద్యోగాలు, భూమి, ఇళ్లు ఉన్నవారి పేర్లు ఎలా చేర్చారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులను నిలదీసి గ్రామసభ కోసం వేసిన టెంట్‌ను కూల్చివేశారు. పంచాయతీ కార్యదర్శికి ఎవరికి ఇళ్లు ఉందో లేదో తెలియదా అని ఆయనను పంచాయతీ కార్యాలయంలోకి పంపించి తాళం వేశారు. దీంతో అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎంపీడీఓ రాంచందర్‌రావు, రూరల్ సీఐ రజితారెడ్డి గ్రామానికి చేరుకొని ప్రజలతో మాట్లాడారు. అర్హత ఉండి జాబితాలో పేర్లు రాని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ పాండురంగన్న, ఏఈఓ రవి తదితరులున్నారు. అదేవిధంగా మండలంలోని నల్లబండగూడెం, రెడ్లకుంట, బీక్యాతండాలో నిర్వహించిన గ్రామ సభల్లో ప్రకటించిన జాబితాలో తమ పేర్లు లేవని ప్రజలు అధికారులతో వాగ్వాదానికి దిగారు.


రామలక్ష్మీపురం గ్రామసభలో కూల్చివేసిన టెంట్

విద్యకు అధిక ప్రాధాన్యం

● అర్బన్ డెవలప్‌మెంట్ డిప్యూటీ సెక్రటరీ సీహెచ్. ప్రియాంక

చివ్వెంల(సూర్యాపేట): రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ డిప్యూటీ సెక్రటరీ సీహెచ్. ప్రియాంక అన్నారు. శుక్రవారం చివ్వెంల మండల పరిధిలోని ఐలాపురం గ్రామ శివారులోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలను ఆమె సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థుల అభ్యసన తీరును పరిశీలించారు. నేటి పోటీ ప్రపంచంలో విద్య ముఖ్యమైనది, విద్యార్థులు ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో కలిసి బస చేశారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ దుర్గభవాని, ఉపాధ్యాయులు సుజాత, సంధ్యారాణి తదితరులున్నారు.


విద్యార్థుల అభ్యసన తీరును పరిశీలిస్తున్న డిప్యూటీ సెక్రటరీ ప్రియాంక

అర్హత ఉండి.. రాకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి

● మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట): పట్టణ, గ్రామసభల్లో వెల్లడించిన జాబితా తుది జాబితా కాదని, ఇందులో పేరు లేకుంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయా పట్టణాలు, గ్రామాల్లో నిర్వహించిన సభలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈనెల 26 నుంచి అమలు కాబోతున్న నాలుగు పథకాల జాబితాలో పేర్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందొద్దని అన్నారు. మొదటగా నిరుపేదలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా ఇలా ఏ పథకం అయినా అర్హత ఉన్న వారికే అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. పదేళ్ల అధికారంలో ఉండి కూడా ఒక పేదవాడికి న్యాయం చేయలేకపోయిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే చూసి ఓర్వలేక అవాకులు చవాకులు పేలుస్తుందని రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పి. శ్రీవాణి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి

చివ్వెంల(సూర్యాపేట): విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి అన్నారు. శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌లో ఉన్న జ్యోతిరావుపూలే బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదలపై అవగాహన కల్పించారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి భావిపౌరులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో డిఫెన్స్ కౌన్సిల్స్ వసంత సత్యనారాయణ పిళ్లే యాదవ్, బొల్లెద్దు వెంకటరత్నం, బట్టిపల్లి ప్రవీణ్ కుమార్, పెండెం వాణి, జిల్లా సంక్షేమ అధికారి నర్సింహరావు, సీడబ్ల్యూసీ చైర్మన్ రమణరావు పాల్గొన్నారు.

డీసీసీబీని లాభాల బాటలోకి తీసుకొచ్చాం


మహాజన సభలో మాట్లాడుతున్న చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

● చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు రూ.2,652 కోట్ల టర్నోవర్‌తో లాభాల బాటలోకి తీసుకొచ్చామని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండలోని డీసీసీబీలో జరిగిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. నూతన పాలకవర్గం అధికారం చేపట్టే నాటికి రూ.900 కోట్ల టర్నోవర్‌లో ఉన్న బ్యాంకును అందరి సమష్టి కృషితో రూ.30 కోట్ల లాభాల్లోకి తీసుకొచ్చామన్నారు. గతంలో రాష్ట్ర స్థాయిలో 8వ స్థానంలో ఉన్న బ్యాంకును నేడు 2వ స్థానానికి తీసుకొచ్చామన్నారు. పంట రుణం ఎకరాకు రూ.లక్ష ఉండగా దానిని రూ.1,50 లక్షల వరకు ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. సకాలంలో పంట రుణాలను చెల్లించిన రైతులకు వడ్డీ రాయితీ 3శాతాన్ని 2024 వరకు చెల్లించనున్నామని పేర్కొన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా ఇచ్చిన పంట రుణాలు రూ.500 కోట్లు కాగా ఇప్పటి వరకు ప్రభుత్వం రూ.324 కోట్లు రుణమాఫీ చేసిందన్నారు. రూ.100 కోట్ల డిపాజిట్ల లక్ష్యానికి గాను రూ.92 కోట్లు సేకరించామని, నెలాఖరు వరకు లక్ష్యాన్ని పూర్తి చేస్తామన్నారు. పాలకవర్గ కాల పరిమితిని పెంచాలని త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించనున్నామన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, సీఈఓ శంకర్‌రావు, మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, డైరెక్టర్లు అందెల లింగం యాదవ్, పాశం సంపత్‌రెడ్డి, అంజయ్య, డీసీఓలు, సహకార సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులతోనే సమసమాజ నిర్మాణం

● మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి


మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

తుంగతుర్తి: అసమానతలు లేని సమాజ నిర్మాణం కమ్యూనిస్టులతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల జరగనున్న నేపథ్యంలో శుక్రవారం మల్లు స్వరాజ్యం స్వగ్రామమైన మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో ఆమె స్మారక జ్యోతిని ప్రారంభించారు. ఈసందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. భూమికోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం సాగిన వీర తెలంగాణ సాయుధ పోరాటంలో మల్లు స్వరాజ్యం నిర్వహించిన పాత్ర మరువలేనిదన్నారు. మొదటగా కొత్తగూడెం గ్రామంలో మల్లెపాక మైసయ్య స్మారక స్థూపానికి నివాళులర్పించారు. అనంతరం కొత్తగూడెం నుంచి డి తుంగతుర్తి వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, నాయకులు మట్టపలి సైదులు, కోట గోపి, చెరుకు యాకలక్ష్మి, పులుసు సత్యం, కందాల శంకర్‌రెడ్డి, కొప్పుల రజిత, మద్దెల జ్యోతి, ఉప్పలయ్య, సైదులు, యాదగిరి, పల్లా సుదర్శన్, తాటి విజయమ్మ, ఓరుగంటి అంతయ్య తదితరులు పాల్గొన్నారు.

బడి బయట ఎందరు?

మధ్యలో చదువుమానేసిన పిల్లల గుర్తింపునకు సర్వే
- వారిని పాఠశాలలో చేర్పించేలా కార్యాచరణ
- నేటితో ముగియనున్న ప్రక్రియ
- వివరాలు ప్రబంధ్ యాప్‌లో నమోదు
- గత ఏడాది జిల్లాలో 211 మంది పిల్లల గుర్తింపు


నడిగూడెం మండలంలో సర్వే చేస్తున్న సీఆర్పీ

జిల్లా వివరాలు...

ప్రభుత్వ పాఠశాలలు	967
పాఠశాల కాంప్లెక్స్‌లు	64
సర్వేలో పాల్గొంటున్న సీర్పీలు	77
గతేడాది గుర్తించిన బడి బయట పిల్లల సంఖ్య	211

నాగారం : బడీడు పిల్లలు ఆడుతూ పాడుతూ అక్షరాలు నేర్వాలి. అప్పుడే సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యం నెరవేరుతుందని ప్రభుత్వ ఉద్దేశం. కానీ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది చిన్నారులు వివిధ కారణాలతో పాఠశాలకు దూరం అవుతున్నారు. వీరు బాల కార్మికులుగా ఇతర పనులు చేస్తూ జీవితం గడుపుతున్నారు. దీంతో వారి జీవితం అంధకారంగా మారుతుండటంతో పాటు దేశ భవిష్యత్తుపై ప్రభావం చూపుతోంది. ఇలాంటి చిన్నారులకు ఆసరాగా నిలవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఏటా విద్యాశాఖ ఆధ్వర్యంలో డిసెంబరు12వ తేదీ నుంచి నెల రోజులపాటు 6–19 ఏళ్ల లోపున్న వారు బడి బయట ఎంత మంది ఉన్నారనే దానిపై సీఆర్పీల ద్వారా సర్వే నిర్వహిస్తుంటారు. ఈ సారి సమగ్ర శిక్షా ఉద్యోగులు, మండల విద్యావనరుల కేంద్రాల్లో పనిచేసే సీఆర్పీలు సమ్మెలో ఉండడంతో...సర్వేకు ఆటంకం కలిగింది. తాజాగా ప్రభుత్వం ఆ సర్వేను జనవరి 12వ తేదీ నుంచి చేపట్టగా.. 25వ తేదీ శనివారం ఈ ప్రక్రియ ముగియనుంది. ఈమేరకు మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల సముదాయ ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో సీఆర్పీలు పిల్లలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో బడి బయట ఉన్న పిల్లల సర్వేలో ప్రధానంగా 6 నుంచి 14, 15–19 సంవత్సరాల వయసులోపు పిల్లలు పాఠశాలకు వెళ్లకుండా ఉన్న వారిని, బడీడు ఉండి బడిలో చేరని వారిని, మధ్యలో బడి మానేసి పనులకు వెళ్తున్న వారిని, వరుసగా 30 రోజుల పాటు పాఠశాలకు వెళ్లకుండా డ్రాప్ అవుట్లుగా ఉన్నవారిని గుర్తిస్తున్నారు. క్షేత్రస్థాయిలో సీఆర్పీలు సర్వే చేస్తున్న క్రమంలో.. చదువుపై ఆసక్తిని పెంచేందుకు చిన్నారులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. సర్వే పారదర్శకత కోసం రోజువారీగా వివరాలను ప్రబంధ్ పోర్టల్లో నమోదు చేస్తున్నారు. బడి బయట గుర్తించిన పిల్లలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలల్లో చేర్పించనున్నారు.

సర్వే ఇలా....
బడి బయట పిల్లలను గుర్తించేందుకు మొదటగా క్లస్టర్ పరిధిలో పనిచేస్తున్న సీఆర్పీలు మండలాల్లోని గ్రామాలు, ఆవాస ప్రాంతాల్లో ఇంటింటి సర్వేను నిర్వహించాలి. సర్వే చేస్తున్న క్రమంలో సీఆర్పీలు తప్పని సరిగా ఫొటో దిగి, సీఆర్పీ పేరు, కాంప్లెక్స్ పేరు, మండల వివరాలతో ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు చేయాలి. సర్వేలో గుర్తించిన బడిబయట పిల్లలను సమీపంలోని పాఠశాలలు, వసతి గృహాలు, కేజీబీవీ, గురుకులాల్లో చేర్పించాలి. అవసరమైన వారికి సార్వత్రిక విద్యా పీఠం ద్వారా పరీక్ష రాసేందుకు అనుమతిస్తారు. ఇటుకబట్టీలు, పత్తి మిల్లుల దగ్గర పని చేసేందుకు ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారి పిల్లలకు పని ప్రదేశంలోనే ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి.

జిల్లాలో ఇలా...
జిల్లాలోని 23 మండలాల్లో 64 క్లస్టర్లు ఉండగా వీటి పరిధిలో 77 మంది సీఆర్పీలు పనిచేస్తున్నారు. వీరందరూ క్షేత్రస్థాయిలో బడి బయట పిల్లల గుర్తింపు సర్వేను చేపట్టారు. సముదాయ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు ఈ సర్వేను పర్యవేక్షించనున్నారు.

33 అంశాల సేకరణపై దృష్టి...
బడి బయట ఉన్న చిన్నారులను గుర్తించేందుకు సీఆర్పీలకు అందజేసిన సర్వే పత్రంలో 33 అంశాలను పొందుపరిచారు. విద్యార్థి, తల్లిదండ్రులు, ఆధార్ కార్డు నంబరు, మాతృభాష, చిరునామా, సెల్‌నంబర్, చదువుకు దూరం కావడానికి గల కారణాలతో పాటు ఇతర వివరాలను సర్వే పత్రంలో నమోదు చేయాల్సిఉంది. ఆవాస ప్రాంతాల్లో ఎంత మంది బడికి దూరంగా ఉంటున్నారు. పాఠశాలకు ఎందుకు వెళ్లడం లేదనే పూర్తి వివరాలు తెలుసుకుంటున్నారు. సర్వేలోని ఏ ఒక్క అంశాన్ని తేలికగా తీసుకోరాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ నెల 25వ తేదీ లోపు సర్వే పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి


బడి బయట పిల్లల గుర్తింపు సర్వేను సీఆర్పీలు పకడ్బందీగా నిర్వహించాలి. మండలాల్లోని గ్రామాలు, ఆవాస ప్రాంతాలల్లో బడి బయట పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించాలి. గుర్తించిన పిల్లల వివరాలను ప్రబంద్ పోర్టల్‌లో నమోదు చేయాలి. ఇంటింటి సర్వేలో పాఠశాలలకు కొద్దినెలలుగా గైర్హాజరు అవుతున్న విద్యార్థులకు, పోషకులకు కౌన్సెలింగ్ నిర్వహించి బడికి హాజరయ్యేట్లు చూస్తాం.
–దేవరశెట్టి జనార్దన్, కోఆర్డినేటర్ ఫర్ అవుటాఫ్ స్కూల్ చిల్డ్రన్, సూర్యాపేట

క్లుప్తంగా

అమ్మనబోలులో చోరీ

మోటకొండూర్: మండలంలోని అమ్మనబోలు గ్రామ రామాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ నాగుల ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని రామాలయంలో పూజారి శోభన్ రోజువారీగా పూజలు నిర్వహించి తాళం వేసి వెళ్లాడు. కాగా శుక్రవారం ఆలయానికి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉండడంతో స్థానికులకు తెలియజేశాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి దర్యాప్తు చేశారు. ఆలయంలో ఒక గ్రాము బంగారంతోపాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీసీ కెమెరా, హార్డ్ డిస్క్ దొంగతనానికి గురైనట్లు గమనించారు. పూజారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

టేబుల్ టెన్నిస్ కెప్టెన్‌గా నరసింహరాజు



కోదాడ: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల టేబుల్ టెన్నిస్ పోటీల్లో కోదాడ నీటి పారుదల శాఖలో పనిచేస్తున్న ఉద్యోగి నరసింహరాజు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా నియమితులయ్యారు. ఈ నెల 23, 24వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఈ పోటీలు జరిగాయి. ఫిబ్రవరిలో ఢిల్లీలో జరిగే పోటీల్లో నరసింహరాజు కెప్టెన్‌గా రాష్ట్ర జట్టు పాల్గొననుంది.

మిస్సింగ్ కేసు నమోదు

భువనగిరిటౌన్ : కూలిపని చేయడం కోసం 2023 అక్టోబర్ 27వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన వాసగోని ఆంజనేయులు ఇప్పటివరకు ఇంటికి రాలేదని అతడి అన్న వాసగోని మణికుమార్‌గౌడ్ శుక్రవారం భువనగిరి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన తమ్ముడు కూలి పని కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి ప్రతి 6 నుంచి 7 నెలలకు ఒకసారి ఇంటికి వచ్చేవాడని.. కానీ సంవత్సరం గడిచిపోయినా రాకపోవడంతో అనుమానం వచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మణికుమార్‌గౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

చౌటుప్పల్ రూరల్: బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టిన సంఘటన చౌటుప్పల్ మండలం ఎస్.లింగోటం గ్రామ పరిధిలోని ప్రతిష్ఠ కంపెనీ ఎదురుగా శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన పాతకోట భానుప్రకాష్, పాతకోట చందు బైక్‌పై ఇబ్రహీంపట్నం వెళ్లి తిరిగి ఇంద్రపాలనగరం వస్తున్నారు. ఈ క్రమంలో ప్రతిష్ఠ కంపెనీ ఎదురుగా వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న భానుప్రకాష్, చందు గాయపడ్డారు. చికిత్స కోసం వారిని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుల సోదరుడు పాతకోట రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణమల్ సూర తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

గరిడేపల్లి : మండల పరిధిలోని పొనుగోడు క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. వివరాలు.. మోతె మండలం సిరికొండ గ్రామానికి చెందిన బాలేమియా అతడి భార్యతో జాన్‌పహాడ్ ఉర్సుకు వెళ్తున్నాడు. అదేవిధంగా మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు పవన్, విజయ్, రాకేష్ హుజూర్‌నగర్ నుంచి గరిడేపల్లి వైపునకు వస్తున్నారు. ఈ క్రమంలో పొనుగోడు క్రాస్ రోడ్డు వద్దకు రాగానే రెండు బైక్‌లు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో బాలమియా దంపతులతోపాటు ముగ్గురు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. వీరిలో బాలమియా భార్యకు తీవ్ర గాయాలు కావడంతో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆకట్టుకుంటున్న పర్యాటక అందాలు

- ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే దిశగా సాగర్‌కు సొబగులు
- రూ.15 కోట్లతో అభివృద్ధి పనులు
- స్వదేశీ దర్శన్ కింద రూ.100 కోట్లు మంజూరు చేయాలని కేంద్రానికి డీపీఆర్

నేడు జాతీయ పర్యాటక దినోత్సవం

జాతీయ పర్యాటక దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జనవరి 25వ తేదీన జరుపుకుంటున్నారు. ప్రజలు తమ దేశంలో ఉన్న అందమైన ప్రదేశాలను చూసి ఆస్వాదించాలని ప్రోత్సహించడమే పర్యాటక దినోత్సవ ముఖ్య ఉద్దేశం. దేశంలో ఉన్న అందమైన ప్రదేశాలు, అద్భుత కట్టడాలు చూసి వాటి చరిత్రను మన ముందు తరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉన్న పర్యాటక ప్రదేశాలపై ప్రత్యేక కథనం. - నాగార్జునసాగర్, దేవరకొండ, భువనగిరి



వైజాగ్ కాలనీ అందాలు

నాగార్జునసాగర్: ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే దిశగా నాగార్జునసాగర్ నూతన సొబగులు అద్దుకునేందుకు సిద్ధమవుతోంది. పర్యాటక ప్రాంతమైన నాగార్జున సాగర్‌లో ఇప్పటికే 274 ఎకరాల్లో బుద్ధవనాన్ని తీర్చిదిద్దారు. ప్రపంచంలోని బౌద్ధులకు స్వర్గధామంగా మార్చేందుకు రూ.15కోట్లతో పనులు జరుగుతున్నాయి. స్వదేశీ దర్శన్‌లో భాగంగా నిధులు మంజూరు చేయాలని ఎంపీ రఘువీర్‌రెడ్డి.. కేంద్ర పర్యాటక మంత్రిని కలిసి కోరారు.

బుద్ధవనంలో ..

పామరులకు సైతం బుద్ధుడి జీవితం అర్థమయ్యేలా 2,500 బొమ్మల రూపంలో డిజిటల్ మ్యూజియం ఏర్పాటుకు అధికారులు అనుమతి పొందారు. దీనికి సుమారుగా రూ.25 కోట్లు ఖర్చుకానుంది. ఇందులో బౌద్ధ విశ్వవిద్యాలయం, గ్రంథాలయం, సోలార్‌తో విద్యుదుత్పాదన, హైవే వెంట కమర్షియల్ కాంప్లెక్సు నిర్మాణం, స్థూప పార్కులో రాతితో ఫ్లోరింగ్, మహాస్థూపానికి రంగులు అద్దడం పనులకు శ్రీకారం చుట్టారు. విదేశీ పర్యాటకులు అధికంగా వస్తుండడంతో వారికి సౌకర్యాలు పెంచేలా స్టార్‌హోటల్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. అలాగే సాగర్ జలాశయంలో, దిగువ కృష్ణానది (టెయిల్‌పాండ్)లో వాటర్ గేమ్స్, చిన్న చిన్న బోట్‌లను స్వయంగా నడుపుతూ వెళ్లేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ప్రకృతి అందాలకు నిలయం వైజాగ్‌కాలనీ..

సాగర్ జలాశయం వెనుకభాగంలో ఉన్న వైజాగ్ కాలనీలో ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు పర్యాటకులు ఉవ్విళ్లూరుతూ వస్తుంటారు. వారు బస చేసేందుకు అక్కడ ఏర్పాట్లు చేయనున్నారు. అలాగే జలాశయంలో జాలీ ట్రిప్పులు వేసేందుకు చిన్నపాటి బోట్‌లను ఏర్పాటు చేయనున్నారు. పర్యాటకులకు రుచికరమైన చేపలతో భోజనం, రకరకాల చేపల వంటకాలు, పచ్చళ్లు దొరికేలా తగిన ఏర్పాట్లను పర్యాటక అభివృద్ధి సంస్థ చేయనుంది.

చాకలిగట్టు ఏకో టూరిజంగా..



చాకలి గట్టు

అటవీశాఖ పర్యాటక శాఖలు సంయుక్తంగా నాగార్జునసాగర్ జలాశయం మధ్యలో 407 ఎకరాల్లో విస్తరించి ఉన్న చాకలి గట్టును ఏకో టూరిజంగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. చాకలి గట్టుకు వెళ్లే లాంచీలను బుద్ధవనం వెనుక వైపు నుంచి నడపాలని, చాకలి గట్టుపై ప్రకృతిని ఆస్వాదిస్తూ టూరిస్టులు రాత్రి వేళల్లో బస చేసేందుకు గ్రామీణ వాతావరణం కల్పించేందుకు నిర్మాణాలకు ప్రతిపాదనలు చేశారు.

సాగర్ నుంచి సీప్లేన్స్..



నాగార్జునసాగర్ జలాశయం నుంచి ఎగిరే సీ ప్లేన్లను నడిపేందుకు గతంలో కేంద్ర ప్రభుత్వం సర్వే నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే విజయవాడ నుంచి శ్రీశైలం వరకు ట్రయల్ రన్ చేశారు. హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ నుంచి నాగార్జునసాగర్‌కు సీప్లేన్‌లను నడిపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వీటిలో 10 నుంచి 20మంది వరకు ప్రయాణం చేసేందుకు వీలుంటుంది. ఇటీవల నాగార్జునసాగర్‌లో 1600 ఎకరాల్లో ఎయిర్ పోర్ట్ ఏర్పాటు చేసేందుకు కూడా భూముల సర్వే చేశారు.

అద్భుత కళాఖండాల ఖిలా..

- శిథిలావస్థకు చేరిన పలు కట్టడాలు
- ఇటీవల రూ.5 కోట్లతో ఖిలా ఆవరణలో పార్క్ నిర్మాణం



దేవరకొండ ఖిలా ప్రధాన ద్వారం



కోటలోకి వెళ్లే దారిలో ఎత్తయిన ప్రాకారం

దేవరకొండ: వందల ఏళ్ల చరిత్ర కలిగిన దేవరకొండ ఖిలాకు ఎంతో ప్రాచుర్యం ఉంది. తెలంగాణలో ఉన్న కోటలన్నిటిలో దేవరకొండ కోట తనకంటూ ఒక ప్రత్యేకతను సొంతం చేసుకుంది. 13వ శతాబ్దంలో నిర్మితమైన దేవరకొండకు సురగిరి అనే పేరుంది. కోట గోడలు ప్రస్తుతం బీటలు వారినా.. నిర్మాణ శైలి నేటికీ అబ్బురపరుస్తుంది. పది కిలోమీటర్ల పొడవు, 500 అడుగుల ఎత్తులో ఏడుకొండల మధ్య నిర్మితమైన దేవరకొండ కోట శత్రుదుర్భేద్యంగా ఉండేది. మట్టి, రాళ్లతో కట్టిన కోట గోడలు నేటికీ నాటి నిర్మాణ శైలిని చాటుతున్నాయి. ఇక్కడి శిల్పకళా సంపద చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయి.

శిథిలావస్థకు కట్టడాలు

దేవరకొండ కోటలో పలు కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గతంలో ఖిలాలోని శిల్పకళా సంపదను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. అంతే కాకుండా ఖిలా పైకి వెళ్లే మార్గంలో పలుచోట్ల పెద్దపెద్ద బండరాళ్లు పడిపోయాయి. గతంలో ఖిలాను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలంటూ స్థానికులతోపాటు వివిధ పార్టీల నేతలు తమ గొంతుకను వినిపించారు. కోట సంరక్షణకు చర్యలు చేపట్టాలంటూ నినదించారు. ఇప్పటికీ పలుచోట్ల శిల్పకళా సంపద దెబ్బతిని కనిపిస్తుంది.

రూ.5కోట్లతో పార్క్ నిర్మాణం

దేవరకొండ ఖిలా ఆవరణలో రూ.5కోట్లతో పార్క్ నిర్మాణానికి గత ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇటీవల పార్క్‌ను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ప్రారంభించారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు పార్క్ నిర్మాణం చేపట్టారు. దీంతో దేవరకొండకు మణిహారంగా ఖిలా పార్క్ నిలిచింది.

పర్యాటక ప్రాంతం చేయాలంటూ..


ఎంతో చరిత్ర కలిగిన దేవరకొండ ఖిలాను పర్యాటక ప్రాంతంగా ఏర్పాటు చేయాలనేది ఇక్కడి ప్రజల చిరకాల కోరిక. అందుకు తగ్గట్టుగా ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ దేవరకొండ ఖిలాను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఖిలాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే దేవరకొండతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలు సైతం అభివృద్ధి చెందుతాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



దేవరకొండ ఖిలాలో ఏర్పాటు చేసిన పార్క్

భువనగిరి ఖిలాకు హంగులు..

- వసతుల కల్పన, కొత్త నిర్మాణాలు, వారసత్వ కట్టడాల పునరుద్ధరణ
- నాలుగు దశల్లో రూ. 118 కోట్లతో పనులు



భువనగిరి ఖిలా

భువనగిరి : ఎన్నో పోరాటాలకు, చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది భువనగిరి ఖిలా. హైదరాబాద్ నగరానికి 47 కిలోమీటర్ల దూరంలో ఏక శిలపై నిర్మించబడిన చారిత్రక కట్టడం భువనగిరి కోట. 610 మీటర్ల ఎత్తయిన ఈ కొండ తాబేలులా, ఏనుగులా కనిపిస్తుంది. ఈ కోటను పశ్చిమ చాళుక్య వంశానికి చెందిన 6వ త్రిభువన మల్లవ విక్రమాదిత్య పాలనలో నిర్మించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. అంతటి చరిత్ర కలిగిన ఖిలా ఆధునిక హంగులను సంతరించుకోనుంది. స్వదేశీ దర్శన్ 2.0 పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూ. 118 కోట్లు ఖర్చు చేయనుండగా తొలి విడతలో రూ. 56.82 కోట్లు మంజూరయ్యాయి. తెలంగాణ రాష్ట్ర పర్యాటక సంస్థ లిమిటెడ్ ఆధ్వర్యంలో పనులకు శ్రీకారం చుట్టారు. ఇటీవల టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయింది.

చేపట్టనున్న పనులు ఇవీ..

ఖిలా అభివృద్ధి పనులు నాలుగు దశల్లో చేపట్టనున్నారు. పర్యాటకులను ఆకర్షించేలా రోప్‌వే ఏర్పాటు చేయనున్నారు. రోప్ వే వెంట 30 మీటర్ల వెడల్పుతో రోడ్డు, రహదారి వెంట యాక్సెస్ రోడ్డు, పార్కింగ్, ఫుట్‌పాత్, కోట ద్వారాల వద్ద భారీ ప్లాజా సైట్ అభివృద్ధి చేయనున్నారు. వీటితోపాటు అడ్మిన్ బ్లాక్, అవసరమైన చోట టాయిలెట్లు, ప్రస్తుతం ఉన్న టాయిలెట్లు పునరుద్ధరణ, ప్రవేశ ద్వారం, కాంపౌండ్ వాల్, శిల్పాలు, ఫుడ్‌కోర్టు రానున్నాయి. కొండపై కొత్త టాయిలెట్లు, ఫలహారశాల, మంచి నీటి వసతి, మెట్ల మార్గాన్ని సరిచేయనున్నారు. తొలి విడత పనులకు రూ.56.82 కోట్లు ఖర్చు చేయనున్నారు.

కట్టడాల ఆధునీకరణ

కొత్త పనులతోపాటు కోటపైన ఉన్న కట్టడాల ఆధునీకరణ పనులను చేపట్టనున్నారు. ముఖ ద్వారం వద్ద విద్యుదీకరణ, కొండపైన ఏర్పాటు చేయనున్న పార్కింగ్ వద్ద టైటింగ్, ఇంటర్ ప్రిటేషన్ సెంటర్ పై టెన్సిల్ స్ట్రక్చర్ రూప్ నిర్మాణం చేపడతారు. కోటపైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.

పెరగనున్న పర్యాటకులు

భువనగిరి ఖిలా హైదరాబాద్–వరంగల్ ప్రధాన రహదారికి సమీపంలో ఉంది. ఇక్కడికి నిత్యం భారీ సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. విదేశీయులు కూడా ఖిలాను సందర్శిస్తారు. రాక్ క్లైంబింగ్ శిక్షణ స్కూల్ ఉండడం వల్ల రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి యువత, విద్యార్థులు ఇక్కడ రాక్‌క్లైంబింగ్‌లో శిక్షణ పొందుతారు. అలాగే జిప్‌లైన్ సైతం ఇక్కడ ఉంది. ఇప్పటికే కోట నమూనా చిత్రాలను విడుదల చేయడంతో ఆ చిత్రాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.



భువనగిరి ఖిలాపై కోట



భువనగిరి ఖిలాపైన కట్టడం

అద్భుతం.. బుద్ధవనం

- ఇండియన్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ బృందం



బుద్ధుడి పాదాలకు పుష్పాంజలి ఘటిస్తున్న ఎయిర్‌పోర్ట్ అథారిటీ బృందం

నాగార్జునసాగర్: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ జలాశయ తీరంలో నిర్మించిన బుద్ధవనం మహా అద్భుతంగా ఉందని ఇండియన్ ఎయిర్ పోర్ట్ అథారిటీ బృందం సభ్యులు కొనియాడారు. ఢిల్లీకి చెందిన ఇండియన్ ఎయిర్‌పోర్ట్ బృందం తెలంగాణలోని కొత్తగూడెం, ఆంధ్రప్రదేశ్ పరిధిలోని నాగార్జునసాగర్ ప్రాజెక్టు తీర ప్రాంతంలో విమానాశ్రయాలను ఏర్పాటు చేసేందుకు భూముల సర్వేకు వచ్చారు. వారం రోజులుగా విజయవిహార్‌లోనే ఉంటూ క్షేత్రస్థాయి సర్వే చేశారు. శుక్రవారం వారు బుద్ధవనాన్ని సందర్శించారు. వీరికి బుద్ధవనం ఈఓ శాసన్, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు బుద్ధుడి పాదాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం బుద్ధుడు జన్మించిన దగ్గరి నుంచి నిర్యాణం వరకు కళ్లకు కట్టినట్లు నిర్మించిన పార్కులను సందర్శించారు. బుద్ధ చరిత వనం, తపోవనం, జాతక పార్కు, స్థూప పార్కు, మహాస్థూపం తదితర ప్రాంతాలను సందర్శించారు. ధ్యాన మందిరంలో కాసేపు ధ్యానం చేశారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు బుద్ధవనం గురించి వివరించారు. బుద్ధవనం చారిత్రక విశేషాలను స్థానిక గైడ్ సత్యనారాయణ తెలియజేశారు. కార్యక్రమంలో పరవింద తివారి, శిబిచక్రవర్తి, అజయ్‌కుమార్, ఏఎస్ఎన్ మూర్తి, ఎం.జె బాబు, డీకే మిశ్ర, ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, నిరంజన్ పాల్గొన్నారు.

చదువులో మేటి.. జీవితంలో ఓడి

- బీటెక్ గోల్డ్‌మెడల్ సాధించిన ప్రైజా
- చోరీ కేసులో తన భర్త నిందితుడని తేలడంతో మనస్తాపం
- ఇద్దరు కూతుళ్లకు ఉరివేసి.. తానూ ఆత్మహత్య
- తమ కూతురు దుస్థితి ఎవరికీ రావద్దని రోదించిన ప్రైజా తల్లిదండ్రులు

మధిర: ఉద్యోగం చేస్తున్నట్లు నమ్మించి ప్రేమవివాహం చేసుకున్న తన భర్త చివరకు చోరీ కేసుల్లో నిందితుడని తెలియడంతో కుమార్తెలకు ఉరివేసిన మహిళ తాను సైతం ఆత్మహత్యకు పాల్పడింది. ఖమ్మం జిల్లా మధిర మండలం నిదానపురానికి చెందిన బాజీ రైలులో వెళ్లే క్రమంలో సూర్యాపేటకు చెందిన మౌనికతో పరిచయం ఏర్పడింది. ఉద్యోగం చేస్తున్నట్లు నమ్మించి మౌనికను ప్రేమ పేరుతో మతాంతరం వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత బాజీ అసలు రూపం బయటపడింది. అతడు చోరీ కేసుల్లో నిందితుడని తెలిసింది. అయితే, ఈ విషయంలో మౌనికకు బంధువులు నచ్చచెప్పారు. అయితే, మరో ఘటనలోనూ బాజీ పట్టుబడగా పోలీసులు విచారణకు రావడంతో మౌనిక అలియాస్ ఫైజా(ప్రైజా) మనస్తాపం చెందింది. గురువారం తన ఇద్దరు కుమార్తెలకు ఉరి వేసి తాను కూడా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను నిదానపురం తీసుకువచ్చారు. ప్రైజా బీటెక్‌లో గోల్డ్‌మెడల్‌తో ఉత్తీర్ణత సాధించగా ఎంటెక్ అనంతరం విదేశాలకు పంపించాలనుకున్నామని ఆమె తల్లిదండ్రులు తెలిపారు. బాజీ పేదవాడైనా తమ కూతురు ఇష్టాన్ని కాదనలేదని, ఆస్తిపాస్తుల కోసం తమ వద్దకు ఎప్పుడూ రాలేదని అన్నారు. భర్త చోరీ కేసుల్లో నిందితుడని తెలిసి నచ్చచెప్పినా తీరు మారకపోవడం, మరోమారు కేసులో ఇరుక్కోవడంతో కష్టసమయాన తమ వద్దకు రాలేక అవమానంతో ఆత్మహత్యకు పాల్పడిందని తల్లిదండ్రులు, బంధువులు రోదించారు. యువతులెవరూ మాయగాళ్ల వలలో పడొద్దని, కంటికి రెప్పలా పెంచుకున్న తల్లిదండ్రులకు కన్నీరు మిగల్చవద్దని వారు చేతులు జోడించి వేడుకోవడం స్థానికులను కలిచివేసింది. ప్రైజా, ఆమె కుమార్తెల అంత్యక్రియలను నిదానపురంలో శుక్రవారం రాత్రి నిర్వహించారు. పోలీసుల అదుపులో ఉన్న బాజీ.. వీరి అంత్యక్రియలకు హాజరుకాలేదు.

భక్తజన సంద్రంగా జాన్‌పహాడ్ దర్గా

- వైభవంగా గంధోత్సవం
- వేడుకల్లో పాల్గొన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



నాగుల పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

పాలకవీడు: సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ సైదన్న ఉర్సుకు భక్తజనం పోటెత్తారు. రెండో రోజైన శుక్రవారం గంధోత్సవం సందర్భంగా సుమారు లక్షన్నరకు పైగా భక్తులు దర్గాను దర్శించుకున్నారు. వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి తీసుకొచ్చిన పవిత్ర గంధాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పూజారి జానీ ఇంటి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన అశ్వంపై మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి చందన్ ఖానాలో ఉంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పుర వీధుల్లో ఊరేగించారు. వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించిన అశ్వంపై పవిత్ర గంధాన్ని కల్మేట్‌తండా, జాన్‌పహాడ్, చెరువుతండా గ్రామాల వీధుల్లో ఊరేగించారు. గంధం సాయంత్రం నాలుగు గంటలకు దర్గాకు చేరుకుంది. ఆ సమయంలో భక్తుల దర్శనాన్ని నిలిపివేసి గంధాన్ని దర్గాలోకి తీసుకొచ్చి సైదులుబాబా(హజరత్ సయ్యద్ జాన్‌పాక్ షాహిద్ రహ్మతుల్లా అలై, సోదరుడు సయ్యద్ మొహినుద్దీన్‌షా) సమాధుల పైకి ఎక్కించి ప్రత్యేక ప్రార్థనలు, నమాజులు చేశారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు.

కృష్ణా నదిలో పుణ్యస్నానాలు..

ప్రతి పదిహేను నిమిషాలకు ఒక బస్సు చొప్పున కోదాడ, మిర్యాలగూడెం ఆర్టీసీ డిపోల నుంచి భక్తులకు రవాణా సౌకర్యం కల్పించారు. కృష్ణా నదిలో, వాటర్ ట్యాంకుల వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి దర్గాను దర్శించుకున్నారు. దర్గా సమీపంలో ఉన్న నాగుల పుట్ట వద్ద మహిళలు పాలు, పండ్లు, గుడ్లు నైవేద్యం సమర్పించారు.

పోలీసుల ప్రత్యేక క్యాంపు

భక్తుల సౌకర్యం కోసం దర్గా సమీపంలో మెడికల్, పోలీసులు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశారు. దర్గా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం పారిశుద్ధ్య కార్మికులు పనిచేశారు. అంబులెన్సు, అగ్నిమాపక వాహనాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

డెక్కన్ పరిశ్రమ సహకారం..

ఉర్సుకు డెక్కన్ పరిశ్రమ యాజమాన్యం సహకారం అందించింది. రోడ్ల మరమ్మతులు, 8 ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. 30 తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు చేశారు.

రూ.1.50 కోట్ల వ్యయంతో దర్గా అభివృద్ధి

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉర్సుకు ముఖ్య అతిథిగా హాజరై గంధం ఊరేగింపు ప్రారంభించి సైదులుబాబాను దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. దర్గ అభివృద్ధికి రూ.1.50 కోట్లు ప్రత్యేక నిధులు కేటాయించి ఖర్చు చేశామన్నారు. వేడుకల్లో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెల్లంకొండ విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ భూక్యా గోపాల్, బుజ్జి మోతీలాల్, ఎస్‌వి.సుబ్బారావు, సప్పిడి నాగిరెడ్డి, నరసింహారావు, జితేందర్‌రెడ్డి, వెంకటి, నీమానాయక్, ముస్లిం మత పెద్దలు, దర్గా ముజావర్ జానీ తదితరులు పాల్గొన్నారు.



దర్గా పరిసరాల్లో కిక్కిరిసిన భక్తులు



జాన్‌పహాడ్ దర్గా

మంత్రి కాన్వాయ్‌లో ఢీకొన్న నాయకుల కార్లు



ప్రమాదానికి గురైన కాంగ్రెస్ నాయకుల కార్లు

గరిడేపల్లి: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం హుజూర్‌నగర్ నుంచి జాన్‌పహాడ్ ఉర్సుకు వెళ్తుండగా గరిడేపల్లి వద్ద కాన్వాయ్‌లోని వాహనాలు ప్రమాదానికి గురయ్యాయి. గరిడేపల్లి వద్ద రోడ్డుపక్కన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కనబడడంతో మంత్రి కారు ఆపారు. అయితే, కాన్వాయ్‌లో వస్తున్న పలువురు కాంగ్రెస్ నాయకుల కార్లు సడన్ బ్రేక్ వేయడంతో ఒకదానికి ఒకటి మొత్తం ఆరు కార్లు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. కార్లు దెబ్బతిన్నాయి. మంత్రి కాన్వాయ్‌లోని అధికార వాహనాలకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ సంఘటనతో కొద్దిసేపు మిర్యాలగూడ–కోదాడ ప్రధాన రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. స్థానిక నాయకులతో మాట్లాడిన తర్వాత మంత్రి ఉత్తమ్ అక్కడి నుంచి జాన్‌పహాడ్ వెళ్లిపోయారు. పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.